క్లుప్తంగా

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



పెనమలూరు: యోగాతో సంపూర్ణ ఆరోగ్యంగా జీవించగలుగుతామని యోగా గురుజీ ఈశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. పోరంకి హైస్కూల్‌లో ఆదివారం శ్రీవెంకటేశ్వర యోగా కేంద్రం ఆధ్వర్యాన 70వ శిక్షణ శిబిరం ముగింపు, 71వ శిబిరం ప్రారంభ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. యోగా చేయడం వల్ల అనేక అనారోగ్య సమస్యలు వైదొలిగి ఆరోగ్యవంతంగా జీవించవచ్చని వివరించారు. ప్రతి ఒక్కరూ యోగాను దినచర్యగా చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో భోదకాచార్యులు నేరెళ్ల తులసీకృష్ణ, కొక్కిలిగడ్డ వెంకటకృష్ణ, మాదు శ్రీనివాసరావు, స్థానికులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

పెనమలూరు: గంగూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి గాయాలు కావడంతో పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసుల కథనం మేరకు.. పమిడిముక్కల మండలం వీరంలాకులకు చెందిన బొర్రి ఏసుబాబు లారీ డ్రైవర్‌గా పని చేస్తాడు. కాగా ఏసుబాబు బైక్‌పై వణుకూరు వెళుతుండగా గంగూరు వద్ద శనివారం రాత్రి ఆటో డ్రైవర్ అతి వేగంగా వచ్చి ఏసుబాబును ఢీ కొట్టాడు. ఈ ఘటనలో ఏసుబాబు తలకు గాయమైంది. అతడిని చికిత్సకు ఆస్పత్రిలో చేర్చారు. బాధితుడి భార్య సునీత ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

9న జగ్జీవన్‌రామ్ విగ్రహావిష్కరణ



గన్నవరం: మండలంలోని చిక్కవరం శివారు చింతగుంటలో నూతనంగా ఏర్పాటు చేసిన మాజీ ఉప ప్రధాని బాబుజగ్జీవన్‌రామ్ విగ్రహావిష్కరణ వచ్చేనెల 9వ తేదీన నిర్వహించనున్నట్లు మహాజన సోషలిస్ట్ పార్టీ రాష్ట్ర నాయకుడు కోట దానియేలు మాదిగ తెలిపారు. స్థానిక ఎస్సీ కాలనీలోని కమ్యూనిటీ హాలులో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విగ్రహావిష్కరణకు మంద కృష్ణమాదిగ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభిస్తారని చెప్పారు. ఎంఈఎఫ్ నేతలు దేవరపల్లి విక్టర్‌బాబు, ఏసుబాబు, ఎమ్మార్పీఎస్ నేతలు మంద వేణు మాదిగ, రామ్‌దాని, పులపాక పాస్కల్, కొప్పుల కామేశ్వరరావు, కృష్ణ, రుద్రయ్య పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాల పంపిణీ



పెనమలూరు: పోరంకి చేపల కుండీల వద్ద తారకరామానగర్‌లో నివశిస్తున్న 26 పేద కుటుంబాలకు ఆదివారం ఇళ్ల పట్టాలు, పొజిషన్ సర్టిఫికెట్లను పోరంకిలోని తన కార్యాయలంలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ కలగా గోపాలకృష్ణ, మార్కెట్ యార్డు చైర్మన్ అన్నే ధనయ్య, టీడీపీ నేతలు అనుమోలు ప్రభాకరరావు, కోయా ఆనంద్‌ప్రసాద్, వల్లమూడి శుభశేఖర్, బొప్పన లావణ్య, కే సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

చెత్త శుద్ధి లేదు



పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీ యనమలకుదురులో ఎక్కడ పడితే అక్కడ చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. చెత్తకుండీల్లో వేసిన చెత్తను కూడా మున్సిపాలిటీ పారిశుద్ధ్య కార్మికులు సకాలంలో తొలగించడం లేదు. వర్షాలు కురుస్తున్నాయి, చెత్త తొలగించాలని కోరినా అధికారులు, కార్మికులు స్పందించడం లేదని స్థానికులు వాపోతున్నారు. చెత్త కుప్పల కారణంగా వ్యాధులు ప్రభలే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆందోళణ వ్యక్తం చేస్తున్నారు. యనమలకుదురు కరకట్ట మార్గంలో చెత్త తొలగించి చాలా రోజులైందని వారు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపాలిటీ అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

పాయకాపురం(విజయవాడరూరల్): రౌడీషీటర్లు నేర ప్రవృత్తిని మాని, సత్ప్రవర్తనతో మెలగాలని నున్న రూరల్ పోలీస్ స్టేషన్ సీఐ పి.కృష్ణమోహన్ సూచించారు. నున్న పోలీస్ స్టేషన్ వద్ద రౌడీషీటర్లు, లా అండ్ ఆర్డర్, క్రైమ్ సస్పెక్ట్ షీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ కృష్ణమోహన్ మాట్లాడుతూ.. ఎవరైనా గంజాయి, ఇతర మత్తు పదార్థాల వినియోగం, అక్రమ రవాణా వంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో స్టేషన్ ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

మురుగుపై మీనమేషాలు

- ఫిషరీష్ కార్యాలయ ప్రాంగణంలోకి డ్రెయినేజీ నీరు
- పట్టించుకోని అధికారులు



మురుగునీటిలో పోరంకిలోని ఫిషరీస్ కార్యాలయం

పెనమలూరు: పోరంకిలో ఫిషరీస్‌కు చెందిన పూర్వ ఏడీ కార్యాలయం మురుగునీటితో పూర్తిగా మునిగిపోయింది. ఈ కార్యాలయ ప్రాంగణం అభివృద్ధికి నోచుకోకపోవడం, పోరంకిలోని మురుగునీటి డ్రెయిన్‌ల్లో మురుగునీరు నేరుగా ఫిషరీస్ కార్యాలయం ప్రాంగణంలోకి వదలడంతో పరిస్థితులు దారుణంగా మారాయి. వివరాల్లోకి వెళితే.. పోరంకిలో ఫిషరీస్ కార్యాలయం ఉంది. ఉమ్మడి కృష్ణా జిల్లాగా ఉన్న కాలంలో ఇక్కడ ఫిషరీస్ ఏడీ కార్యాలయం ఉండేది. అయితే ప్రస్తుతం ఈ కార్యాలయం తరలిపోవడంతో ప్రాంగణంలో అడపాదడపా కార్యక్రమాలు మాత్రమే జరుగుతున్నాయి. కార్యాలయంలో పూర్తిస్థాయిలో కార్యకలాపాలు నిర్వహించకపోవడంతో భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. అయితే గ్రామానికి చెందిన డ్రెయినేజీ నీరు ఫిషరీష్ ప్రాంగణంలోకి వదలడంతో కార్యాలయ ప్రాంగణం మురుగునీటితో విలయ తాండవంగా మారింది. పైగా ప్రాంగణం లోతట్టుగా ఉండటంతో మురుగునీరు నిలిచిపోయి చెరువును తలపిస్తోంది. ఫిషరీస్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా కార్యాలయ ప్రాంగణం పరిస్థితులు నానాటికీ దిగజారిపోతున్నాయి. అలాగే తాడిగడప మున్సిపాలిటీ అధికారుల ఉదాసీనత కారణంగా మురుగునీరు ఫిషరీస్ కార్యాలయానికి పెద్ద సమస్యగా మారింది.

విషకీటకాల సంచారం

ఫిషరీస్ కార్యాలయ ప్రాంగణంలోకి మురుగునీరు వచ్చి చేరడంతో విషకీటకాల సంచారం పెరిగింది. ఫిషరీస్ కార్యాలయం చుట్టూ నివాసాలు ఉండటంతో స్థానికులు ఆందోళణ చెందుతున్నారు. డ్రెయినేజీ, మురుగునీరు నిల్వ ఉండటంతో దోమలు కూడా బాగా పెరిగాయి. దీంతో అనారోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం పొంచి ఉందని భయాందోళన చెందుతున్నారు. ఈ ప్రాంగణం చుట్టూ ప్రహరీ నిర్మించడానికి చేసిన ప్రతిపాదనలు అటకెక్కాయి. ఫిషరీస్ శాఖ అధికారులు స్పందించి మురుగునీరు ప్రాంగణంలోకి రాకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

లోతట్టు ప్రాంతాలు జలమయం



తేలప్రోలులో ఇళ్ల ముందు వర్షంనీరు

గన్నవరం/ఉంగుటూరు: గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు గన్నవరం, ఉంగుటూరు మండలాల్లోని పలు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కుండపోతగా వర్షం కురవడంతో పల్లపు ప్రాంతాల్లోని రోడ్లు, ఇళ్ల మధ్యకు నీరు చేరింది. తేలప్రోలులోని ఎస్సీ కాలనీలో డ్రెయిన్లు పొంగి పొర్లాయి. డ్రెయిన్లు పూడుకుపోవడంతో వర్షం నీరు రోడ్లపైకి చేరి కాలువలను తలపిస్తున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. గ్రామపంచాయతీ అధికారులు స్పందించి డ్రెయిన్లలో మురుగునీటి క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. కేసరపల్లి శివారు వెంకటనరసింహాపురం కాలనీలో వర్షానికి అంతర్గత రోడ్లు ముంపునకు గురయ్యాయి. దీంతో రాకపోకలు స్తంభించి కాలనీవాసులు ఇళ్లలో నుంచి బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. రమణమ్మ చెరువు, రాజీవ్‌నగర్ కాలనీలోని లోతట్టులో ఇళ్లలోకి వర్షం నీరు చేరి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

టీడీపీలో అధ్యక్ష కుంపటి

- పార్టీ శ్రేణుల్లో అసంతృప్తి సెగలు
- మొదలైన రాజీనామాల పర్వం

కంకిపాడు: టీడీపీలో అధ్యక్ష ఎంపిక కుంపటిలా రగులుతోంది. పార్టీ శ్రేణుల అభిప్రాయాలతో పని లేదని చెప్పేలా ఏకపక్ష నిర్ణయాన్ని ముఖ్య నేత ప్రకటించడంతో శ్రేణుల్లో అసమ్మతి, అసంతృప్తి నెలకొంది. కంకిపాడు మండల పీఠంపై జరిగిన నిర్ణయం ప్రస్తుతం పార్టీలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. మహానాడు లోపు అన్ని గ్రామ, మండల కమిటీలను పూర్తి చేయాలనే ఆదేశం టీడీపీలో ఉంది. ఈ క్రమంలో గ్రామ కమిటీలను దాదాపుగా పూర్తి చేశామని అనిపించారు. ఇందులోనూ ముఖ్య నేత కార్యాలయం నుంచి వచ్చిన మౌఖిక ఆదేశాల మేరకు అధ్యక్షుల ఎంపికను పూర్తి చేశారనే వ్యాఖ్యలు బాహాటంగానే వినిపిస్తున్నాయి. ఇందులో భాగంగానే మండల అధ్యక్షుల ఎంపిక ఈనెల 24న పోరంకిలోని ప్రధాన కార్యాలయంలో పరిశీలకులు రాంబాబు సమక్షంలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ఆధ్వర్యంలో పూర్తి చేశారు. ఈ దఫా కంకిపాడు మండల అధ్యక్ష పీఠాన్ని కొత్త వారికి కట్టబెడతామని ముందు నుంచి చెప్పుకుంటూ వచ్చి గతంలో పనిచేసిన సుదిమళ్ల రవీంద్ర పేరును ఖరారు చేశారు.

పార్టీలో అసమ్మతి

వివిధ గ్రామాల నుంచి ముఖ్యనేతలు, గ్రామ పార్టీ బాధ్యుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా అధ్యక్ష ఎంపిక జరిగిందన్న ప్రచారం పార్టీలో జరుగుతోంది. పలువురు ముఖ్య నేతలు కొత్త వారికి బాధ్యతలు అప్పగించాలని, గతంలో సమన్వయ, సమాచార లోపం కారణంగా పార్టీ కార్యక్రమాలు క్షేత్రస్థాయికి చేరలేదనే అభిప్రాయాన్ని పరిశీలకులు, ఎమ్మెల్యే సమక్షంలో వ్యక్తపరిచినట్లు సమాచారం. అలాగే మండలంలోని పలువురు పార్టీ నేతలు, కార్యకర్తలు తమ అసమ్మతిని రాజీనామాల రూపంలో వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పలువురు ముఖ్యనేతలు తమకు పార్టీలో ఉన్న బూత్ ఇన్‌చార్జి, యూనిట్ ఇన్‌చార్జి, ఇతర పదవులకు సైతం రాజీనామాలు చేస్తున్నారు. ఈ మేరకు వాట్సాప్ ద్వారా ఎమ్మెల్యే బోడె ప్రసాద్ దృష్టికి తీసుకెళ్తున్నట్లు సమాచారం. ఏకపక్ష నిర్ణయాలు సరికాదని, గ్రామ స్థాయి నేతల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకపోవడం పట్ల నేత తీరుపై విసుగెత్తినట్లు తెలుస్తోంది.

ఉత్సాహంగా వేసవి విజ్ఞాన తరగతులు



వణుకూరు గ్రంథాలయంలో పుస్తక పఠనం చేయిస్తున్న గ్రంథాలయ అధికారి భారతి



తెన్నేరులో కుట్లు, అల్లికలపై శిక్షణ పొందుతున్న చిన్నారులు



ముస్తాబాదలో లూడో ఆడుతున్న విద్యార్థులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం వీరవల్లిలోని గ్రంథాలయంలో చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు ఉత్సాహంగా సాగుతున్నాయి. ఈ శిక్షణలో భాగంగా ఆదివారం విద్యార్థులకు నీతికథలు, జనరల్ నాలెడ్జ్ పుస్తకాలను పరిచయం చేశారు. పంచతంత్రం కథలతోపాటు పలు రకాల నీతికథల పుస్తకాలను విద్యార్థులకు అందించి చదివించారు. నీతికథలు చదవడం వల్ల వ్యక్తిత్వ వికాసం, నైతిక విలువలు అలవర్చుకోవచ్చని గ్రంథాలయ అధికారి పీ స్వర్ణలతాదేవి విద్యార్థులకు వివరించారు. భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి చేరడానికి పుస్తక పఠనం ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. అనంతరం జనరల్ నాలెడ్జ్ తరగుతులు, క్రీడా శిక్షణ నిర్వహించారు.

- పెనమలూరు: విద్యార్థులు పుస్తక పఠనం అలవాటు చేసుకుంటే విజ్ఞానం పెరుగుతుందని వణుకూరు గ్రంథాలయ అధికారిణి భారతి పేర్కొన్నారు. వణుకూరు గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ తరగతుల్లో భాగంగా ఆదివారం విద్యార్థులతో పుస్తక పఠనం చేయించారు. గ్రంథాలయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పుస్తక పఠనం వల్ల చదువుపై శ్రద్ధ పెరుగుతుందన్నారు. తోక కథలు, ఆటపాటలు నిర్వహించారు.
- గన్నవరం రూరల్: ముస్తాబాద శాఖా గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులకు చెస్, లూడో, క్యారమ్స్ పోటీలు నిర్వహించారు. అలాగే పుస్తక పఠనం చేయించారు. నీతి కథలు చెప్పించారు. లైబ్రేరియన్ కే జ్యోతికుమారి పర్యవేక్షించారు.
- కంకిపాడు: ఆటపాటలతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని వక్తలు పేర్కొన్నారు. కంకిపాడు శాఖా గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులకు పుస్తక పఠనం, కథలు పుస్తకాలు చదవడంలో పోటీలు నిర్వహించారు. రైల్వే శాఖ సూపరింటెండెంట్ కే రాంబాబు విద్యార్థులకు సూచనలు ఇచ్చారు. పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తూ ప్రతిజ్ఞ చేయించారు. శిబిరాన్ని గ్రంథాలయాధికారి సీహెచ్ రామకృష్ణ పర్యవేక్షించారు. తెన్నేరు శాఖా గ్రంథాలయంలో క్యారమ్స్, భగవద్గీత శ్లోక పఠనంపై పోటీలు నిర్వహించారు. డీ లక్ష్మి చిన్నారులకు కుట్లు, అల్లికలపై శిక్షణ ఇచ్చారు. శిబిరాన్ని గ్రంథాలయాధికారి ఎస్.సునీత పర్యవేక్షించారు.

ప్రతిభ చాటిన విద్యార్థులకు సత్కారం



విద్యార్థులను సత్కరించిన అగ్నికుల క్షత్రియ యూత్ ఫోర్స్

పెనమలూరు: పదవ తరగతిలో 550 మార్కులు పైగా సాధించిన విద్యార్థులను అగ్నికుల క్షత్రియ యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సత్కరించారు. ఈ మేరకు అగ్రికుల క్షత్రియ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంద్రాజు శ్రీనివాసరావు వివరాలు తెలుపుతూ కృష్ణా, గుంటూరు, ప్రకాశం, ఉభయగోదావరి జిల్లాకు చెందిన 100 మంది విద్యార్థులు పదిలో ఉత్తమ మార్కులు సాధించినందుకు యనమలకుదురు అగ్నికుల క్షత్రియ కార్యాలయంలో శాలువలు కప్పి, మెమెంటోలు ఇచ్చి సత్కరించామని తెలిపారు. కార్యక్రమంలో సంఘ జాతీయ అధ్యక్షుడు కే నరసింహారావు, సంఘ నేతలు పొన్నాడ శ్రీనివాసరావు, యుగంధర్, బుర్రె ప్రసాద్, సైకం భాస్కరరావు, గీతా గోపీచంద్, కొల్లాటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చురుగ్గా డ్రెయిన్ నిర్మాణం



హిందూ శ్మశానవాటిక వద్ద నిర్మిస్తున్న డ్రెయిన్

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం ఎనికేపాడు హిందూ శ్మశానవాటిక వద్ద డ్రెయిన్ నిర్మాణం చురుగ్గా జరుగుతోంది. పంచాయతీ నిధులు రూ. 25లక్షలతో శ్మశానవాటిక ప్రారంభం నుంచి చివరి వరకు శ్లాబ్‌తోపాటు డ్రెయిన్ నిర్మిస్తున్నారు. ఇటీవల సాక్షిలో శ్మశానం వద్ద చెత్త డంపింగ్‌తోపాటు మురుగునీటి సమస్య గ్రామస్తులను వేధిస్తోందని వరుస కథనాలు ప్రచురించింది. దీనిపై స్పందించిన సంబంధిత అధికారులు ఈ ప్రాంతంలో పేరుకుపోయిన చెత్త కుప్పలను తొలగించి డ్రెయిన్ నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ రాచమళ్ల పూర్ణచంద్రరావు మాట్లాడుతూ నిర్మాణ పనులు పూర్తికావొచ్చాయని త్వరలో డ్రెయిన్‌ను ప్రారంభిస్తామని తెలిపారు.

ఓగిరాల ఎంపీటీసీ సభ్యుడు మృతి



సుబ్బారావు భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గాంధీ తదితరులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: వైఎస్సార్ సీపీ నాయకుడు, ఓగిరాల ఎంపీటీసీ సభ్యుడు తోకల సుబ్బారావు(73) ఆకస్మికంగా మృతిచెందారు. బాపులపాడు మండలం ఓగిరాలలోని ఆయన నివాసంలో శనివారం రాత్రి ఒక్కసారిగా గుండెపోటుకు గురై కుప్పకూలిపోయాడు. కుటుంబ సభ్యులు వెంటనే హనుమాన్‌జంక్షన్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే సుబ్బారావు మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆయనకు భార్య, ఒక కుమారుడు. దాదాపు 20 ఏళ్ల పాటు ఓగిరాలలో రేషన్ డీలర్‌గా సుబ్బారావు సేవలందించారు. ఆ తర్వాత ఓగిరాల సర్పంచ్‌గానూ సేవలు అందించారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు నక్కా గాంధీ, ఎంపీపీ యర్రగొర్ల నగేష్, కాకులపాడు ఎంపీటీసీ సభ్యుడు పడకల కోటేశ్వరరావు, తిప్పనగుంట పీఏసీఎస్ మాజీ చైర్మన్ మూల్పూరు ప్రభుకాంత్ ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

రూరల్‌లో 14 మోడల్ ప్రైమరీ పాఠశాలలు

విజయవాడరూరల్: మండలంలో ఈ విద్యాసం వత్సరం 14 మోడల్ ప్రైమరీ పాఠశాలలను ఏర్పాటు చేస్తున్నట్లు ఎంఈఓ ఏ.సూరిబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పాఠశాలల్లో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు ప్రతి 20 మంది విద్యార్థులకు ఒక టీచర్‌ను నియమించి బోధన చేయడం జరుగుతుందన్నారు. గ్రామాల్లో మోడల్ ప్రైమరీ పాఠశాలల వివరాలు.. గొల్లపూడి క్లస్టర్‌లో గొల్లపూడి మెయిన్ ఎలిమెంటరీ స్కూల్, నిడమానూరు, దొనే ఆత్కూరు, రామానగర్, ఎనికేపాడు మెయిన్ ఎలిమెంటరీ స్కూల్, తాతాపురం స్కూల్, నున్న క్లస్టర్‌లో నున్న మెయిన్ ఎలిమెంటరీ స్కూల్, నున్న పడమర ఎలిమెంటరీ స్కూల్, పాతపాడు ఎలిమెంటరీ స్కూల్, రామవరప్పాడు క్లస్టర్‌లో రామవరప్పాడు మెయిన్ ఎలిమెంటరీ స్కూల్, పీఎస్ఆర్ కాలనీలో ఎలిమెంటరీ స్కూల్, ప్రసాదంపాడు గ్రామంలో ఎలిమెంటరీ స్కూల్, జక్కంపూడి క్లస్టర్ జక్కంపూడి ఎలిమెంటరీ స్కూల్, కొత్తూరు తాడేపల్లి ఎలిమెంటరీ స్కూల్‌ను మోడల్ స్కూల్స్‌గా ఏర్పాటు చేయడం జరిగిందని వివరించారు. అలాగే మండలంలో 14 బేసిక్ ప్రైమరీ స్కూల్స్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వీటితోపాటు మండలంలో ఎనిమిది హైస్కూల్స్, నాలుగు మండల ప్రాథమికోన్నత పాఠశాలలు ఉన్నాయని తెలిపారు.

అప్రకటిత విద్యుత్ కోతలతో అవస్థలు

గన్నవరం రూరల్: అప్రకటిత విద్యుత్ కోతలతో ప్రజలు అల్లాడుతున్నారు. నిత్యం కరెంట్ పోవడంతో గన్నవరం, ముస్తాబాద, నున్న, వీరపనేనిగూడెం సబ్ స్టేషన్‌ల పరిధిలో ఉన్న గ్రామాల్లోని ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఎప్పుడు కరెంట్ పోతుందో తెలియని దుస్థితి ఏర్పడిందని వాపోతున్నారు. ఉక్కపోతతో అల్లాడిపోతుంటే విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారని వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వారం వారం మెయింటెనెన్స్ పేరిట మరమ్మతులు చేస్తున్నామని విద్యుత్ శాఖ అధికారులు తరచూ కోతలు విధించడంపై మండిపడుతున్నారు. రోజూ విద్యుత్ కోతలతో అల్లాడిపోతున్నామని, ఉన్నతాధికారులు క్షేత్ర స్థాయిలో పరిస్థితి సమీక్షించాలని కోరుతున్నారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

రాష్ట్ర ఆర్య వైశ్య సంఘం

పెనమలూరు: పోరంకిలో శ్రీసాయిబాలాజీ కల్యాణ వేదికపై తలెత్తిన వివాదంలో యజమాని చక్కా మురళీ కుటుంబానికి జరిగిన అన్యాయంపై రాష్ట్ర ఆర్యవైశ్య సంఘం అండగా ఉంటుందని ప్రకటించింది. పోరంకిలో ఆదివారం ఏపీ ఆర్యవైశ్య సంఘ చైర్మన్ దుండి రాకేష్ సూచనల మేరకు సమావేశం నిర్వహించారు. సంఘ నేతలు మాట్లాడుతూ సాయిబాలాజీ కల్యాణ వేదిక విషయంలో తీరని అన్యాయం జరిగిందని యజమాని చక్కా మురళీ కుటుంబ సభ్యులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ విడుదల చేసిన వీడియోతో ఆర్యవైశ్య సంఘం వెంటనే స్పందించిందని తెలిపారు. సమావేశంలో ఏపీ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు చిన్ని రామ సత్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు సన్నిధి నాగసాయి శ్రీనివాస్, మండల అధ్యక్షుడు బుద్దా లక్ష్మణ కుమార్, సభ్యులు పాల్గొన్నారు.



- ఆకాశంలో అరుణకాంతి పుంజం

కంకిపాడు: ఆకాశంలో అరుణకాంతి పుంజం ప్రకృతి ఆరాధకులను ఆకట్టుకుంది. ఆదివారం సాయంత్రం ఆకాశాన్ని కారుమబ్బులు కమ్మేశాయి. ఒక్కసారిగా కారుమబ్బులను చీల్చుకుంటూ సూర్యకిరణాలు అరుణ వర్ణంలో భూమిని తాకాయి. ఈ సందర్భంగా ఆకాశం కాంతి పుంజంలా దర్శనమిచ్చింది. ఈడుపుగల్లు వద్ద కనిపించిన ఈ దృశ్యాన్ని సాక్షి తన కెమెరాలో బంధించింది.

ముగిసిన హనుమజ్జయంతి ఉత్సవాలు



దాసాంజనేయస్వామి దేవస్థానంలో భక్తులకు అన్నదానం

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక నూజివీడు రోడ్డులోని 45 అడుగుల ఎత్తైన హనుమాన్ విగ్రహం వద్ద సీతారామ దాసాంజనేయస్వామి ఆలయంలో గత నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న హనుమజ్జయంతి ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఉదయం హనుమంతునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో సీతారామపురం భక్త బృంధం సభ్యులు 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం వద్ద మహాఅన్నప్రసాద వితరణ చేశారు. ఆలయ శాశ్వత ధర్మకర్తలు పల్నాటి సత్యనారాయణ, చోడే వెంకయ్య కుటుంబ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.


దుర్గమ్మకు నృత్య నీరాజనం



నృత్య ప్రదర్శన ఇస్తున్న చిన్నారులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో ఆదివారం పలువురు కళాకారులు కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై విజయవాడ యనమలకుదురుకు చెందిన శ్రీహనుమాన్ నృత్య కళా నిలయానికి చెందిన 14 మంది చిన్నారులు తమ నృత్య ప్రతిభను చాటారు. నృత్యాచార్య కే శ్రీనివాస్ పర్యవేక్షణలో చిన్నారులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శనను భక్తులు ఆద్యంతం ఎంతో ఆసక్తితో వీక్షించారు. అనంతరం శిష్య బృందానికి ఆలయ అధికారులు అమ్మవారి దర్శనం కల్పించి ప్రసాదాలు అందజేశారు.

చినుకు పడితే చిత్తడే



చెరువును తలపిస్తున్న పునాదిపాడు మార్గం గుండా సాగుతున్న రాకపోకలు

కంకిపాడు: ఏడాది లోపు అన్ని ప్రధాన రహదారులను అభివృద్ధి చేస్తామంటూ కూటమి సర్కారు ప్రగల్భాలు పలికింది. కానీ ఆచరణలో నేటికీ అనేక రహదారులు అభివృద్ధికి ఎదురు చూస్తున్నాయి. ఇందులో కంకిపాడు – గన్నవరం ప్రధాన రోడ్డు మార్గం కూడా అభివృద్ధికి నోచలేదు. ఎక్కడ చూసినా పెద్ద గోతులు, కోతకు గురైన మార్జిన్లు, ఎగుడుదిగుడు రోడ్డు మార్గంతో రాకపోకలకు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలు చోట్ల ఉన్న పెద్ద గోతుల్లో చిన్న పాటి వర్షానికే నీరు నిలిచిపోయి వాహనాలు ముందుకు కదలడం లేదు. పలువురు ద్విచక్రవాహనదారులు వర్షం నీటిలో గోతులు కనిపించక వాటిలో దిగబడి పడిపోతున్నారు. ప్రధానంగా కంకిపాడు – పునాదిపాడు అండర్ పాస్ వద్ద ఉన్న బురదకయ్య గుండా రాకపోకలు సాగక వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

పెనమలూరు డివిజన్

90105 77706 (ఉయ్యూరు)
99122 20539 (పెనమలూరు)
90102 10382 (గన్నవరం)

Office mail : sakshiads@gmail.com